


# తెల్లచీర

## కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

"ఈ తెల్లచీరలో నిన్ను చూస్తుంటే అమాంతం ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది..."

"వాట్?" కోపంగా అరిచింది అరవింద.

"అయామ్ సారీ. మనసులో మాట పొరబాటున పైకి అనేశాను..." మురళీకృష్ణ నవ్వుతూ క్షమాపణ చెప్పుకున్నాడు.

"ఓకే... ఓకే... కారు జాగ్రత్తగా నడుపు..." అంది రోడ్డువైపు చూస్తూ...

ఆమెకి లోలోపల ఆ ప్రశంసలకి ఆనందంగానే ఉంది. కానీ, అవిడ బయట పడితే మగాడు.. ఇంకేమన్నా ఉందా?!

"అరవిందా!" "మురళీకృష్ణ కారు నడుపుతూనే ఓరగా ఆమెను చూస్తూ పలకరించాడు.

"చెప్పు..."

"ఇన్నాళ్ళనుంచీ నిన్ను అడగ్గా అడగ్గా ఇవాళ కరుణించావు. ఇలా వంటరిగా నాతో..."

"నా బర్తడే గనుక నీ మాట కాదనలేకపోయాను..."

"ప్రతి రోజు నీ బర్తడే అయితే ఎంత బావుణ్ణు..."

"పిచ్చి మాటలు మాట్లాడుతున్నావ్ మురళీకృష్ణా..."

"నిత్య కళ్యాణం పచ్చతోరణం-పిచ్చి మాటంటావా?"

"కళ్యాణం వేరు బర్తడే వేరు రోజూ కొత్త బర్తడే అంటే పాత బాడీ చనిపోవాలి..."

"నో... నో.... నో... దయచేసి అలాంటి అర్థాలు తీయొద్దు...."

"వసంతంలో కోకిల మౌనంగా ఉండగలదా? మబ్బులు చూస్తే నెమలి ఆడకుండా ఉంటుందా? నీ సమక్షంలో నేనూ అంతే..."

అరవింద చేతి గడియారం చూసుకుంది.

"మరో రెండు గంటలు.. ఆ తర్వాత నేను ఇంట్లో ఉండాలి..."

"నీ మాటలు వింటుంటే నాకో హిందీపాట గుర్తొస్తోంది. అభీ న జావో ఛోడ్‌కర్... కే దిల్ అభీభరానహీం... అంటూ రఫీ ప్రేమికుడి బాధని కమ్మగా గానం చేశాడు..."

"నాకెందుకో ప్రేమ అనగానే అదో తియ్యని మోసం అనిపిస్తుంటుంది..."

"ఎందుకని?"

"చాలామంది ఇష్టాన్నే ప్రేమగా భ్రమ పడుతుంటారు. భ్రమ కల్పిస్తుంటారు కూడా"

"ప్రేమని అర్థం చేసుకునేందుకు ప్రేమ ఉండాలి..."

"అవునేమో..."

"నేను నిన్ను, మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను అరవిందా..."

"కోయిల కూత వసంతంతో బాటు వెళ్ళిపోయింది. పెళ్ళితో ప్రేమకోయిల కూయటం మానేస్తుంది..."

"అలాగని ఎలా చెప్పగలవ్?"

"నా స్నేహితురాళ్ళ కథలే అందుకు ఉదాహరణలు. పెళ్ళి అవ్వగానే కల చెదిరి కఠిన వాస్తవ ప్రపంచంలోకొచ్చిపడ్డాడు. కులాంతర ఆదర్శ ప్రేమ వివాహం చేసుకున్నాక విడాకులు తీసుకునే దాకా ఇద్దరూ నిద్రపోలా... ప్రేమ పేరుతో జల్సాగా తిరిగి అపఖ్యాతిని అమ్మాయికి కట్టబెట్టి, అమాయకత్వం నటిస్తూ మరో పెళ్ళి చేసుకున్నాడు మరో మజ్నూ... ఇలా ఎన్నెన్ని కథలు జరిగాయో...

ఇంకెన్ని జరగనున్నాయో... ఇవన్నీ జీవితం చెప్పని కథలు మురళీకృష్ణా.. అందుకే నేను ప్రేమని నమ్మను..."

కారు 'ఫైవ్‌స్టార్' హోటల్ ముందు ఆగింది. కారు పార్క్ చేసి లోపలికి దారి తీశాడు మురళీకృష్ణ. అరవింద వెంట నడిచింది.

x x x

"డిన్నర్ చాలా బావుంది కృష్ణా..."

"థాంక్యూ... నీ బర్తడే గిఫ్ట్ కూడా ఎలా ఉందో చెప్పు..." అంటూ జేబులోంచి చిన్న పెట్టె తీసి, అందులోని వజ్రాల ఉంగరం చూపించాడు.

"బావుంది. కానీ, ఇంత ఖర్చు పెట్టాలా?"

"నీ ప్రేమ ముందు ఇది చాలా తక్కువ అరవిందా..."

"కృష్ణా! నేను నిన్ను ప్రేమిస్తున్నట్లు ఎప్పుడూ చెప్పలేదే... ఎందుకిలా ఎక్కువగా ఊహించుకుంటున్నావ్?"

"ప్లీజ్... నాప్రేమకు పరీక్ష పెట్టకు అరవిందా... నువ్వు నన్ను ప్రేమించకపోతే పోనీ... కానీ ఆ విషయాన్ని గుండెకోసినట్లు నా మొహం మీదనే చెప్పకు నేను భరించలేను..."

ఆమె కొద్ది క్షణాలు అతనికేసే చూసింది. అతని మొహంలోంచి అతని మనసు చదివేయటం ప్రయత్నించి "ప్లీజ్" అంటూ ఉంగరం ఆమె చేతి వేలికి తొడిగేందుకు చెయ్యి జాచాడు.

యాంత్రికంగా ఆమె చెయ్యి ముందుకు జాచింది. వేలికి ఉంగరం తొడిగేడు మురళీకృష్ణ. కొద్దిక్షణాలు అలాగే వేలికి మెరుస్తున్న ఉంగరంకేసి ఆనందంగా, తృప్తిగా చూశాడు. ప్రేమ నిండిన కళ్ళతో ఆమె కళ్ళలోకి చూశాడు.

ఆమె కళ్ళు ఇంకా ఏదో శోధిస్తూనే ఉన్నాయి. అంతలో చటుక్కున ఆమె ముంజేతిని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె వళ్ళు ఝల్లుమంది. చెయ్యి వెనక్కి లాగేసుకుని "చాలా ఆలస్యం అయ్యింది. ఇక వెళ్దాం" అంది లేచి నిలబడి.

"నా ప్రేమని ఇంకా నువ్వు నమ్మవా అరవిందా?!" దీనంగా అడిగేడు మురళీకృష్ణ..

"నేను స్నేహాన్ని నమ్ముతాను..." అంది మొహం తిప్పుకుని అరవింద.

"వెళదాం పద..." నిట్టూరుస్తూ అన్నాడు.

ఇద్దరూ బయటికి దారితీశారు. తలుపు దగ్గర 'శాల్యూట్' అందుకుని ఓ పది రూపాయల కాగితం ఇచ్చి, కారుకేసి నడిచాడు మురళీకృష్ణ.

అరవింద లోపల సంఘర్షణ చెలరేగుతోంది. తన ప్రవర్తనలో ఏమైనా తప్పుందా? మురళీకృష్ణ తనని నిజంగానే ప్రేమిస్తున్నాడేమో... అతన్ని అనవసరంగా అనుమానిస్తోందా? గాయపరుస్తోందా? ఎటూ తేల్చుకోలేకపోతోంది.

అంతలో కారులో మురళీకృష్ణ వచ్చాడు.

డోర్ తెరిచి "ఎక్కు..." అన్నాడు. కూర్చున్నాక గమనించింది. చీరమీద ఐస్‌క్రీమ్ అంటుకుంది. రుమాలుతో తుడిచింది. తెల్లచీరమీద "రోజ్ కలర్" ఐస్‌క్రీమ్ మచ్చ మొండిగా అతుక్కుపోయింది.

"ఏమిటది?" అనడిగాడు మురళీకృష్ణ కారు ముందుకు పోనిస్తూ...

"ఐస్‌క్రీమ్ మచ్చ..."

"పోతుందిలే..."

"తెల్లచీర మీద మచ్చలంత త్వరగా పోవు కృష్ణా. శీలంమీద పడిన మచ్చకూడా అంతే! అందుకే నేనెంతో జాగ్రత్తగా ఉంటాను..."

"అరవిందా... రేపే వచ్చి మీ పెద్దవాళ్ళతో మన పెళ్ళి గురించి మాట్లాడతాను..." దృఢస్వరంతో అన్నాడు మురళీకృష్ణ.

"వద్దు మురళీకృష్ణా! సృష్టిలో ప్రేమకంటే స్నేహమే మధురమైంది. నాకు నువ్వు భర్తకంటే మిత్రుడిగా ఉండటమే ఇష్టం..." అతనింకేమీ మాట్లాడకుండా కారు నడపసాగాడు.